# తెలివిగల భార్య

శ్రీ కప్పగంతుల సత్యనారాయణ

రంగారావుకి గవర్నమెంటు ట్రైనింగుస్కూల్లో మేష్టరీ. చాలా మంచివాడని నలుగుర్లోనూ పేరు. తోటి మేష్టర్లందరికీ అతనంటే ప్రేమా గౌరవమూనూ. చాలా సార్లు స్కూల్లోకి లేటుగా వచ్చినా, హెడ్ మాష్టరు సణుగుకొనేవాడుకాడతనివిషయములో.

రంగారావుకి జీతమరవై రూపాయలు. ప్రావిడెంటు ఫండుకీ, ఇన్సూరెన్సు ప్రిమియానికీ పోగా చేతికొచ్చేవి నలభయ్యొనిమిదిరూపాయలు. స్కూలుకెళ్ళే ముగ్గురు మగపిల్లలకీ జీతాలు, యింటిబాడుగా పోతే మిగిలిన డబ్బుతో సంసారం గడవటం దుస్తరంగా వుంది. పైగా పెళ్ళికెదిగింది ఒకాడపిల్ల. తల్లిచేతిది ఒకాడపిల్ల. చంటిపిల్లకి పుట్టినప్పటినుంచీ రోగాలే. డాక్టరుకీ, మందులకీ— బోలెడు డబ్బు.

నెలవచ్చేటప్పటికి దానిడబ్బు దానికివ్వకపోతే దాసీది వూరుకోదు. పైగా బజారులో పెట్టేస్తుంది. మూడు రేవులూ అయేటప్పటికి బిళ్ళల్లాగ రెండురూపాయలూ చేతులో వేస్తేనేకాని చాకలాడు మళ్ళా గుడ్డలికి రాడు. ఏది ఎలావున్నా రోజువిడిచిరోజు గడ్డం గీక్కోవల్సిందే. లేకపోతే ముగ్గురు నలుగురు బిడ్డల్నియెత్తి ట్రైనింగుకువచ్చే తన యీడు శిష్యులతో నెగ్గటం మహాకష్టము.

జీతపురాళ్ళు తప్పితే దమ్మిడీవచ్చే ఆస్కారము లేదు. సంసారమొక యమయాతన అయింది. ప్రైవేటు చెప్పకుందామా అంటే ట్రైనింగు కుర్రాళ్ళకి ప్రైవేటెందుకూ?

ప్రతినెలా పదో పదిహేనో అప్పుదేస్తున్నాడు. మొహమెరిగినవాళ్ళందరిదగ్గరా బదులుచ్చుగున్నాడు. పుచ్చుకున్నవాళ్ళకి మళ్లా యివ్వడానికి యెక్కడనుంచి తెస్తాడు పాపం! తెచ్చినా అప్పుతేవల్సిందే. డెబిట్ బాలెన్సు ప్రతినెలకీ యెక్కువయిపోతోంది.

కొడుకులలో పెద్దాడు చేతి కడ్డమొచ్చేదాకా యిదే అవస్థ తప్పదని రోజులు నెట్టుతున్నాడు. అప్పుల వాళ్ళబాధ యెక్కువయిపోతోంది. వాళ్ళకి రంగారావు పరిస్థితులన్నీ యెలా తెలుస్తాయి. వాళ్ళగోల వాళ్లదికాని.

ఇలావుండగా—

మేష్టర్లంతా ఎక్స్కర్షన్ (Excursion) పోదామన్నారు. నాకు పనుందన్నాడు రంగారావు. ఎంత పనున్నా సరే రాక తప్పదన్నారు. రాకపోకలకి అధమం



పదిరూపాయలైనా కావాలి. పచ్చి వెలక్కాయ గొంతులో పడట్టుంది. హెడ్‌మాస్టరుసహా "మీరు తప్పకుండా రావాలి. స్టేషనులో కలుసుకుంటాము మన మంతానూ" అని నాలుగుసార్లన్నాడు. ఏం విధి!

అతనున్న అవస్థలో పదిరూపాయలు యిలా-మళ్లా కూడబెట్టడానికి వీల్లేకుండా —ఖర్చు పెట్టడమంటే— పోనీ చేతులోవుంటే అనుకోవచ్చును. జీతాలురావడం ఖర్చు అవడం— సెనగలు తిని చెయ్యి కడుక్కున్నట్లు చేతులు ఖాళీఅవడంకూడా అయింది. మరి దారేమిటి.

ఎన్నివిధాల ఆలోచించినా అతనికి మార్గమేమీ తోచలేదు. బదులిచ్చే నిర్భాగ్యుడంత కన్న కనపడలేదు. చేతులో మాత్రం నెలపొడుగునా కూరగాయలు కొనటానికి మిగిల్చిన నాలుగు రూపాయలున్నయి. ఒక్కడు పోవడానికే మూడురూపాయలు టిక్కెట్లవుతుంది. ఎలాగ? ఆలోచించాడు.—తలపగిలేటట్టు ఆలోచించాడు—. ఏం ఆలోచన తోచిందో యేమో. ప్రయాణం కట్టాడు.



చిల్లరఖర్చుకు వాడుకోమని ఒకరూపాయ భార్య చేతికిచ్చి మూడురూపాయలు చేతబట్టుకొని అందరు మేష్టర్లతో పాటతనూ బయలు దేరాడు. అనుకున్న ప్రకారం అంతా రైలుస్టేషనులో కలుసుకున్నారు. ఎవరి టిక్కెట్టు వారే కొనుక్కున్నారు ప్రత్యేకంగా. కూర్చోటం మాత్రం అంతా ఒకపెట్టెలోనే కూర్చున్నారు. నిర్ణీత స్థానమునకు పోయిన తరువాత అంతా సత్రములో బస చేచారు. చీకటి పడింది. హెడ్‌మాష్టరుగారు తెచ్చిన పెట్రోమాక్సులైటు వెలిగించారు. ఊళ్ళో హోటలుకు పోయి భోజనాలు చెయ్యడం మరునాడు ఆ వూళ్ళో వున్న పాడు బడ్డ కోటలూ అవీ చూడ్డం వారిప్రోగ్రాము.

ఒకరివెనుక వొకరు అంతా హోటలుకు బోవడానికి సత్రం వెలుపలికి వచ్చారు. 'అంతా వచ్చారా?' అన్నాడు హెడ్‌మాస్టరు.

'చిత్తం' అన్నాడు అసిస్టెంటు.

"అయ్యా—అయ్యా—" అని లోపల్నించి రంగారావుకేక.

"ఎవరిది?" అన్నాడు హెడ్ మాస్టరు.

"నేనండి. రంగారావును"

"రండి త్వరగా. యింకా లోపలే వున్నారా!"

"తమరు లోపలికోసారి, దయచెయ్యండి"

"ఏం" అనుకుంటూ లోపలికి వెళ్ళాడు హెడ్‌మాస్టరు.

"నాపర్సు కనపడదండీ. చొక్కా జేబులో వేసుకొచ్చాను. రావడంతోటే, కాళ్లూ చేతులూ మొహం కడుక్కోడానికి కొళాయిదగ్గరికి వెడుతూ చొక్కావిప్పి మేకున తగిల్చాను. ఇప్పుడుచూస్తే పర్సుకనబడదు"

'చొక్కా విప్పేటప్పుడు' న్నదా పర్సు జేబులో?

'జ్ఞాపకము లేదు'

'ఆశ్చర్యం అంత మన వాళ్ళే'

'అలాటి వాళ్ళెవరూ లేరు మనలో; మరిచాలా చిత్రంగావుంది ఏంచెయ్యను ఇప్పుడు వేరేవొక్క దమ్మిడీలేదు నాదగ్గర'

"సరే ప్రస్తుతం మేమెవరమో సర్దుకుంటములెండి అసలుయే మాత్రముందే మిటి పర్సులో?

"పదిహేను రూపాయిల పైచిల్లర యేమోవుంది?

"అబ్బ"

"...............”

"సరే రండి బైటికి"

ఆరాత్రికిపూటకూళ్ళకి హెడ్‌మాస్టరే యిచ్చాడు. మరునాడు మేష్టర్లంతా ఆలోచించుకొని తలోక రూపాయి వేసుకొని రంగారావుకి యిచ్చారు.

"జీతమురాగానే సర్దుబాటుచేస్తాలెండి" అంటూ తీసుకున్నాడు. కాని, ఎవరూ అతనిదగ్గర మళ్లా తీసుకో దలచలేదు. ఏమంటే

అతను చాలా పెద్దమనిషి. కు టుం బీ కు డు. పదిహేనురూపాయల నష్టం పోవడమంటే అతనికి చాలా కష్టమైనసంగతి—పోనీమంటే పోనీ అనుకున్నారు మేష్టర్లంతా.

కాని, యింటికిమాత్రం యిలాంటి విచారకమైన సంగతి జరిగినందుకు చాలా చిన్నబోయిన మొహాల్తో వచ్చారు—అంతాను. అవసరాన్నిబట్టి అలా అబద్ధమాడ వలసివచ్చినందుకు రంగారావుకికూడా చిన్నతనంగానే వుంది.

ఇంకోసారి—

చిన్న బావమఱది పెళ్ళికి వెళ్ళాల్సివచ్చింది. పెళ్ళి హడావిడిలో—పూర్వోక్తరీతిగా—అతని పర్సు మళ్లీ దొంగలెత్తుకుపోయినారు.

అల్లుడుపడ్డ నష్టానికి అత్తగారు మామగారికి తెలియకుండా కూతురిద్వారా లాంఛనాల బాపతులోవి యాభై రూపాయలు ముట్టజెప్పింది. యీసారి యంత్రం బాగానే పారింది.

మరోసారి—

తన మేనమామకొడుకి కార్యానికి వెళ్లినప్పుడు కూడా జేబుదొంగతనం ప్రకటించాడు రంగారావు. ఈసారి నష్టంపెట్టుకుందుకు ఎవరూ ముందుకురాలా. మేనమామదగ్గర చేబదులు తీసుకోవలసివచ్చింది. డబ్బు లేనప్పుడు చేబదులు పుట్టడంమాత్రం మేలు కాదూ!

మూడుసార్లు తనయుక్తి అప్రతిహతంగాఫలించింది. కాస్తోకూస్తోలాభించింది. కాని—ఇంకోసారి—ఇదే యెత్తు యెత్తవలసివచ్చింది—పరాయిచోటునయితే ఎలా పరిణమించేదో కాని—ఏదో అవసరానికి కావలసివచ్చింది. ఎక్కడా అప్పుపుట్టలా. భార్యదగ్గర వాళ్ళమ్మయిచ్చిన బాపతు నాలుగురూపాయలున్నసంగతి తెలిసింది. ఇమ్మని అడిగితే యెలావుండేదో. కాని, మళ్లీ పాతయెత్తుయెత్తాడు. "జేబులోవున్న అయిదురూపాయల నోటు కనబడదే" అని కేకేసాడు. పిల్లలందర్నీ అడిగాడు. మే మెరుగమంటే మే మెరుగమన్నా రందరూ.

"అర్జంటుగా కా వా లి నాలుగురూపాయలు. నోటు మాయమైంది ఇప్పుడెలా ?" అన్నాడు భార్యతో.

"నాదగ్గర మాఅమ్మ యిచ్చినవి వున్నాయి నాలుగురూపాయలు. యిస్తానుగాని—ఓసంగతి చెప్పండి. నా కనుమానంగా వున్నది" అన్నదా యిల్లాలు.

"ఏమిటది."

"మావాడి పిల్లకీ, మీ మేనమామ కొడుకు పిల్లకీ, యిదే యెత్తు యెత్తారే. ఎక్కడ నేర్చారు ? నే నప్పుడే అను మానించాను. పెళ్లి కెళ్ళేటప్పుడు మీ

దగ్గర టిక్కెట్టుకు చాలీచాలకుండా డబ్బుంటే, పర్సులో నలభై రూపాయలు పోయాయన్నప్పుడే అనుకున్నాను.

"అసలు మీకుపర్సొకటుందీ. అప్పుడే యీ యెత్తు కనిపెట్టాను. అయితే మన మర్యాదకోసం యెక్కడా అనలేదు. ఇంక మరీమరీ యిలా చెప్పకండి యెక్కడాను. అప్రతిష్ఠ" అందావిడ మెల్లిమెల్లిగా చల్లని చీవాట్లతో.

"ఏ—మి—టీ—నీ — మొ — హం—" అని సణిగేశాడు కాని, మొహాన కత్తివాటువేశినా నెత్తురు లేదు పాపం రంగారావుకి.


## అజ్ఞాత పాండవము

దొరతనమువారిచే పఠనీయగ్రంథముగా అంగీకరించబడినది
ప్రతి 1-కి రు 0-10-0

## సహదేవ పశుచికిత్స

(తాత్పర్యసహితము)

పశువులకు గలుగు సకలవ్యాధులకు చికిత్సలు తేటతెల్లముగా తెలుపబడినవి.
ప్రతి 1-కి రు 2-0-0

## ఐరోపాఖండ యుద్ధచరిత్రము

భూగోళచిత్ర భావపట సహితము

1—వ భాగం 0—8—0
2—వ భాగం 0--12—0

## సోదరప్రేమ లేక మాధవరావు

నీతిదాయకమగు నవల.

దొరతనమువారిచే పాఠశాలలకు అంగీకరింపబడినది.
ప్రతి 1-కి 0—10—0

ఆనందబోధిని ఆఫీస్,

సౌకారుపేట, మదరాసు



యువదంపతులకు 50 గ్రంథముల

శృంగారమార్గము సారాంశము

# సతీపతికుతూహల రహస్యములు.

పూర్వకాలమున యువతీయువకులు కావ్యములను చదివి సాస్వాదనము చేయుటయే గాక కామశాస్త్రమును తప్పక పఠించెడువారు. రాణివాసమందలి కాంతలకుకూడ దీనిని నేర్పెడి వారనివాత్స్యాయనుడు వ్రాసియున్నాడు.

నేడి కళాపరిచయము లేక యువతీయువకులు పశువర్తనమే ప్రధానముగ తలంచి వర్తించుచున్నారు. అది వారి యపరాధము కాదు, తగిన గ్రంథము లేకపోవుటే దీనికి ప్రధాన కారణమున నేడీ కొరత తీరినది. సతీపతి కుతూహలరహస్యమను నీ గ్రంథము విపులముగ పూర్వాధునిక కామకళా గ్రంథవిషయములతో నిండి యీ కళాసంబంధమగు పూర్ణజ్ఞానమును కలిగించుచున్న ముద్దులొలుకు చిత్రపటములతో నిండినది.

గ్రంథము వెల 2 రూపాయలు.

పోస్టేజి 7 అణాలు.

ఆర్యన్ బుక్ డిపో,

19, తాండవరాయ మొదలి వీధి,

తిరువల్లిక్కేణి, మదరాసు.